క్లుప్తంగా

100 మంది విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బిషప్ హజరయ్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు 100 మందికి దాతలు శాశ్వత సభ్యత్వం కల్పించారు. నగరానికి చెందిన హరిబాబు, శశి రేఖ దంపతులు పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం కోసం ఒక్కొక్కరికి రూ. 50 చొప్పున రూ. 5 వేల నగదును గ్రంథాలయాధికారి కె. రమాదేవికి అందజేశారు. దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని వినతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కదిరిలో ఇటీవల వైద్య సిబ్బందిపై జరిగిన దాడిని ఖండించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ, అత్యవసర వైద్యం నిర్వహించే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పటిష్టంగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ బీట్‌లు పెంచాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

అన్నప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో దాతలు చెక్కా వెంకట దుర్గారావు, పుష్పలత, లక్ష్మీరుషిత, వెంకట సత్యప్రకాష్, రమామణి, సుజిత్‌బాబా సహకారంతో 200 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవీ మాట్లాడారు.

ఆకట్టుకుంటున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో



లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర చేనేత, జౌళి శాఖ సహకారంతో నగరంలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ప్రారంభమైంది. వివాహాలు, దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పోలో వంద శాతం చేనేత వస్త్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో కళాకారుల చేతిలో తయారైన వస్త్రాలన్నీ ఒక్కచోటకు చేరాయి. వస్త్ర ప్రియులకు తక్కువ ధరలో మంచి వస్త్రాలను అందిస్తున్నారు. కార్యక్రమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో బ్రాండ్ అంబాసిడర్ పి. దీపిక, పలువురు అతిథులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరీలు

విజయవాడ కల్చరల్: లయనాద కళా ప్రవంతి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా దుర్గాపురం శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణ సదనంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తనలను సీహెచ్ లాస్య ప్రియ, జె. శ్రావణి, లంకా తేజస్విని మధురంగా ఆలపించారు. కె. శ్రీకర్, శరవణ విశ్వనాథ్, కె.భార్గవ, గాయత్రి విభావరి, కె. అరవింద్ వాద్య సహకారం అందించారు. నిర్వాహకురాలు మాధవి మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పెద్దపీట వేస్తూ యువ సంగీత కళాకారులకు వేదిక కల్పిస్తున్నామని వివరించారు.

కరాటేతో ఆత్మరక్షణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని వాంబే కాలనీ రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.కోటేశ్వరరావు అన్నారు. పాఠశాల విద్యార్థులకు కరాటే పోటీలను శనివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కరాటే కోచ్‌లు బల్లం కిశోర్, ఎం.నవీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్రతుండ.. మహాకాయ

- నాలుగో రోజుకు చేరిన చవితి ఉత్సవాలు
- గణపతికి ప్రత్యేక పూజలు, అన్నదానాలు



శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో స్వామివారు



శ్రీనగర్ కాలనీలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఉమా



వినాయకనగర్‌లో పూజలు చేస్తున్న కార్పొరేటర్ బి. జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలు శనివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. మధురానగర్, ముత్యాలంపాడు, దావు బుచ్చయ్య కాలనీ, సత్యనారాయణపురం, రామకృష్ణాపురం, చుట్టుగుంట, మాచవరం, వినాయక నగర్, దుర్గాపురం, భానునగర్ తదితర ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీనగర్ కాలనీలో..

శ్రీనగర్ కాలనీ నాలుగో లైనులో వినాయక చవితి వేడుకలలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్వామివారికి పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణను ప్రారంభించి మాట్లాడుతూ నిర్వాహకులు ఏపుగంటి సాయికృష్ణ, లక్ష్మీ అపర్ణ, భక్త బృందం సభ్యులను అభినందించారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. శ్రీనగర్ కాలనీ ఒకటో లైన్‌లో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరావు పాల్గొని పూజలు చేశారు. కమిటీ సభ్యులు దేవరపు మాల్యాద్రి, పడమటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినాయకనగర్‌లో...

వినాయకనగర్‌లో వినాయక నగర్ భక్తబృందం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. మధ్యాహ్నం సుమారు 4వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ట్రస్ట్ సభ్యులు మట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

అరటి పండ్లతో అర్చన

సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాల సమీపంలోని శ్రీలక్ష్మీ గణపతి మందిరంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అరటి పండ్లతో అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మధురానగర్ పప్పులమిల్లు సెంటర్ సమీపంలో బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వినాయకుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి



రాజీవ్‌నగర్‌లో వినాయకుని విగ్రహం వద్ద పూజ చేస్తున్న మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలందరిపై వినాయకుని ఆశీస్సులుండాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. శనివారం రాత్రి రాజీవ్‌నగర్ వృద్ధాశ్రమం రోడ్డులో మెగా ఫ్రెండ్స్‌సర్కిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 63వ డివిజన్ ఇన్‌చార్జి పసుపులేటి ఏసు, మాన్యం జగదీష్, ఉప్పులేటి రాజు, వెంకటరమణారెడ్డి, నంద్యాల ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.64వ డివిజన్ కంద్రిక సెంటర్లో శ్రీలక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

యువ వైద్యులకు సీనియర్లు స్ఫూర్తి

ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు



పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్లను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు, ప్రొఫెసర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సుదీర్ఘకాలం ప్రభుత్వ వైద్య రంగంలో సేవలు అందించి పదవీ విరమణ చేస్తున్న ప్రొఫెసర్లు అభినందనీయులని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు అన్నారు. వారి సేవలను యువ వైద్యులు స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి. శ్రీనివాసరావు, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరావు శనివారం పదవీ విరమణ చేశారు. గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (జీడీఏ ఏపీ) ఆధ్వర్యంలో వైద్య కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు సభలో శనివారం ఘనంగా సత్కరించారు. జీడీఏ ఏపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఐ. బాబ్జి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా వారు స్ఫూర్తివంతమైన సేవలు అందించారని కొనియాడారు. జీడీఏ ఏపీ వైద్య కళాశాల శాఖ అధ్యక్షుడు కె. రవి, ఆయా విభాగాల వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కొవ్వొత్తుల ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): గత ఏడాది బుడమేరు ముంపు బాధితులకు మద్దతుగా.. ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా ఆదివారం ఆంధ్రప్రభ కాలనీ జనహిత సదనం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుడమేరు వరద ముంపు బాధితులు ఏడాది దాటినా ఇప్పటికీ అవస్థలు పడుతున్నారని చెప్పారు. బుడమేరు ప్రక్షాళన ప్రకటనలకే పరిమితం అయ్యిందని విచారం వ్యక్తంచేశారు. ఏడాది గడిచినా వరద ముంపు బాధితులు నేటికీ వరద భయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బుడమేరు ముంపు బాధితులను ఆదుకోవాలని కోరారు. కొవ్వొత్తుల ప్రదర్శనకు నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, బుడమేరు ముంపు బాధితులు తరలి రావాలని మల్లాది విష్ణు కోరారు.

బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు



పడవలో కూర్చొని నినాదాలు చేస్తున్న నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు నివారణ చర్యల్లో కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా, బుడమేరు ముంపు నివారణకు శాశ్వత పరిష్కార చర్యలు డిమాండ్ చేస్తూ, బుడమేరు ప్రక్షాళనకు రూ.10 వేల కోట్ల నిధులను విడుదల చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ బుడమేరు ముంపు రాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని స్వయాన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని గాలికి వదిలేశామని విమర్శించారు. బాధితుల ఎన్యూమరేషన్‌లోనూ అనేక లోపాలు జరిగాయన్నారు. వరద సహాయ చర్యలు, శాశ్వత చర్యలకు రూ.6,880 కోట్ల సహాయం కావాలని కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు ఏడాది గడుస్తున్నా నేటికి కేంద్ర నుంచి నయాపైసా విడుదల చేయించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద బుడమేరు ముంపు బాధితుల ఐక్యవేదిక చేపట్టిన ఆందోళనలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు పడవల్లో కూర్చొని నిరసన తెలిపారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు, సీపీఎం నాయకులు బి.రమణారావు, కె.దుర్గారావు, టి ప్రవీణ్, ఎం.సీతారాములు, సీహెచ్ శ్రీనివాస్, వై.సుబ్బారావు, నిజాముద్దీన్, వెంకటరెడ్డి, పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభ్యున్నతితోనే మహిళా సాధికారత

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలకు ఉపాధి అవకాశం కల్పించాలని వారి ఆర్థిక అభివృద్ధికి అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన మహిళా సాధికారత లభిస్తుందని ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి ఝాన్సీ రాణి అన్నారు. బీఆర్టీఎస్ రోడ్‌డ్ నండూరి ప్రసాదరావు శ్రామిక భవనంలో శనివారం ఐద్వా 28వ డివిజన్ మహాసభ జరిగింది. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో ముందుండాలని సూచించారు. నూతన మద్యం పాలసీ వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు అప్పుల పాలవుతున్నారన్నారు. సాయి కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఐద్వా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా లక్ష్మీదుర్గ, అధ్యకురాలిగా చంద్రకళ, సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మి, కోశాధికారిగా దేవి, కార్యవర్గ సభ్యులుగా స్వాతి ,రాజి , వెంకటలక్ష్మి ,ఉష, దీపిక ఎన్నికయ్యారు.

• గంగమ్మ చెంతకు గణేశుడు





వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయాలు, పందిళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం పలు ప్రాంతాల్లోని ప్రతిమలను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఊరేగింపుగా విగ్రహాలను తీసుకువచ్చారు. నది వద్ద ఏర్పాటు చేసిన క్రేన్ల సాయంతో నిమజ్జనం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించలేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ యు. తారకప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం 12వ పీఆర్‌సీకి కమిటీని వేయలేదని, ఐఆర్ కూడా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం రెండు డీఏలు అయినా విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. పెన్షనర్లకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ గ్రాడ్యుటీ, జీపీఎఫ్, ఇఎల్స్, ఎన్‌కేష్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి వెంటనే ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ పాఠశాలలో హెవీ మోటార్ వెహికల్ (హెచ్‌ఎంవీ) డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షేక్ షాహిద్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తుకు లెట్ మోటార్ వెహికల్ లైసెన్స్(ఎల్‌ఎంవీ), హెవీ డ్రైవింగ్ లెర్నర్స్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్‌ఎల్‌ఆర్) పత్రాలను జతచేసి కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సెప్టెంబర్ 7వ తేదీ లోగా అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు సెల్: 96520 57244 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

జమున నటన భావి నటీమణులకు ఆదర్శం

విజయవాడ కల్చరల్: సినీ నటి జమున నటన భావి నటీమణులకు ఆదర్శమని రంగస్థల నటుడు లక్షణరావు అన్నారు. కళాభారతి జమున కళాపీఠం , సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం వేదికపై శనివారం జమున జయంతి కార్యక్రమం నిర్వహించారు. లక్షణరావు మాట్లాడుతూ జమున తెలుగుతోపాటు తమిళం, కన్నడ సినిమాలలో నటించి ప్రతిభను చాటుకున్నారని చెప్పారు. కళా పోషకుడు డొక్కా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆమె ప్రజాప్రతినిధిగా కళాకారుల సంక్షేమానికి కృషి చేశారని వివరించారు. కళారంగానికి చెందిన కత్రి సూర్యనారాయణ, సజ్జా నాగలక్ష్మి, దుర్గ, లత, పద్మ, భావరాజు ఫణికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రాలు, అన్న ప్రసాదాలను అందించారు.

మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ వినాయక నగర్‌లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయనగర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వినాయక నిమజ్జనోత్సవం..

దేవీనగర్, దావు బుచ్చయ్య కాలనీలో శనివారం సాయంత్రం వినాయక నిమజ్జనోత్సవం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని ఉంచి ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.

జిల్లాకు కాకాని పేరు పెట్టండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఒక జిల్లాకు స్వాతంత్ర్య సమరయోధుడు, జై ఆంధ్రా ఉద్యమ నేత కాకాని వెంకటరత్నం పేరు పెట్టాలని 'కాకాని ఆశయ సాధన సమితి' అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాకు కాకాని వెంకటరత్నం చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన పేరు పెట్టాలన్నారు. అంతేకాకుండా బెంజిసర్కిల్‌కు కాకాని సర్కిల్‌గా నామకరణం చేయాలని కోరారు. కాగా మాధవ్‌ను కలిసిన వారిలో జాస్తి సతీష్, గణేష్ , వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

'మాస్టర్ మైండ్స్' చైర్మన్ అనిల్‌కుమార్‌కు డాక్టరేట్

పాయకాపురం(విజయవాడరూరల్): మాస్టర్ మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ పెంట్యాల అనిల్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. విజయవాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో మాస్టర్‌మైండ్స్ పేర విద్యాసంస్థల నిర్వహణ, బహుళ క్యాంపస్ నిర్వహిస్తున్నందుకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఎథెరియా గ్లోబల్ విశ్వవిద్యాలయం (యూఎస్‌ఏ) అకాడమిక్ కమిటీ శుక్రవారం పెంట్యాల అనిల్‌కుమార్‌కు డాక్టరేట్ ను అందచేసింది. ఈ వివరాలను మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

డీసిల్టింగ్ పనులు పూర్తి చేయండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



అవుట్‌ఫాల్ డ్రెయిన్ పూడికతీత పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్‌లలో డీ సిల్టింగ్ పనులు పూర్తి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం వన్‌టౌన్, నైజాం గేట్, కృష్ణవేణి క్లాత్ మార్కెట్, కబేళ, హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్లలో వ్యర్థాలు ఉన్న వెంటనే వాటిని తొలగించాలని, కృష్ణవేణి మార్కెట్ వద్ద ఉన్న అవుట్ ఫాల్ డ్రెయిన్లలో వెంటనే ఎస్కలేటర్‌ను అమర్చి అక్కడున్న వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అవుట్ ఫాల్ డ్రెయిన్ల వద్ద ఫెన్సింగ్, గేటును ఏర్పాటు చేయాలని, నాలా మాన్‌తో ఎప్పటికప్పుడు పూడికలు తీసేలా గేట్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన కబేళాను సందర్శించి మాట్లాడుతూ జంతు వ్యర్థాలను సక్రమంగా నిర్వహణ చేయాలని, జంతు వ్యర్థాలతో సంపద సృష్టించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య పద కవితకు నృత్యాభిషేకం



విజయవాడ కల్చరల్: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు రచించిన పద కవితకు నృత్యాభిషేకం జరిగింది. మొగల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీ కళావేదికపై త్రైలోక్య ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు ఇందిర పరాశరం ఆధ్వర్యంలో శనివారం నారాయణతే నమోనమో నృత్య రూపకం నేత్ర పర్వంగా సాగింది. అన్నమాచార్యుడు వెంకటేశ్వర స్వామి మీద భక్తి తత్వాన్ని వివరిస్తూ రాసిన కీర్తనలకు మనోహరంగా నృత్యం చేసి కలియుగ నాథుని సాక్షాత్కరింపజేశారు. విన్నపాలు వినవలె, చక్కని తల్లికి ఛాంగుభళా, తిరువీధుల, కంటి శుక్రవారము, పలుకు తేనియ తల్లి తదితర కీర్తనలతో అన్నమయ్య కథను వివరిస్తూ డోలాయాచల డోలాయాతో కార్యక్రమాన్ని ముగించారు. నృత్య కార్యక్రమంలో ఇందిర పరాశరం, సాహితి, శ్రీహిత, శివాని, కె. పవిత్ర, సుముఖి, త్రైలోక్య, కావ్య, చార్వి, గీతిక, శ్రియ, దర్శిని, సృజన, సుధ, నాగసాయి పాల్గొన్నారు. కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు సత్య శ్రీనివాస్, డాక్టర్ పీవీడీవీ ప్రసాద్‌లు నిర్వహించారు. పాలక మండలి సభ్యులు కళాకారులను సత్కరించారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని సత్కరిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీ సరిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన సిబ్బందికి శనివారం పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీ కేజీవీ సరిత ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. కమిషనరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ మనమంతా ఒకే పోలీసు కుటుంబం అన్నారు. ప్రజా సేవకు మీ శక్తి, సమయం వినియోగించారంటూ డిపార్ట్‌మెంట్ తరపున ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ పొందిన వారిలో ట్రాఫిక్ వింగ్ అడిషినల్ డీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ బి. కృష్ణమోహన్, 3 ట్రాఫిక్ ఏఎస్ఐ డి. నయోమి, ఏఆర్ ఏఎస్ఐ కె. కోటేశ్వరరావు, హెచ్‌సీలు ఆర్. శివకృష్ణ, వై. దేవిడ్‌రాజు ఉన్నారు. కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం. రాజారావు, ఏఓ సునీత, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాఫిక్ అధికారులు, సీపీఓ సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ సర్కిల్-3 పరిధి ఐదో డివిజన్‌లోని 46 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు, ఒకటో డివిజన్‌లోని రా వాటర్ పంపింగ్ స్టేషన్ ఇన్‌టెక్‌వెల్ వద్ద ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్న నేపథ్యంలో సర్కిల్-3 పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుణదలలోని అన్ని ప్రాంతాలు, మాచవరం, కార్మిక నగర్, ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదురుగా కొండప్రాంతం, వెంటర్నరీ కాలనీ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, నాగార్జున నగర్, అశోక్ నగర్, గురునానక్ కాలనీ, సాయిబాబా గుడి రోడ్డు, కామినేని నగర్, కేపీ నగర్, పోస్టల్ కాలనీ, ఏపీఐఐసీ కాలనీ, కేడీజీఓ కాలనీ, మారుతీ కో-ఆపరేటివ్ కాలనీ, ఫన్‌టైం క్లబ్ రోడ్డు, వాసవీ నగర్, అరుణ్ నగర్ కొండభాగం, ఎల్ఐసీ కాలనీలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వీటితోపాటు సీటీఓ కాలనీ, మిథిలానగర్, జయప్రకాష్ నగర్, ఫిలిం కాలనీ, ఐటీఐ రోడ్డు, సుబ్బారావు కాలనీ, ఆర్టీసీ కాలనీ, న్యూ పీఅండ్‌టీ కాలనీ, హైస్కూల్ రోడ్డు, రెల్లిస్ కాలనీ, పంటకాలువ రోడ్డు, తంగెళ్లమూడి వారి వీధి, వాసవీ కాలనీ, టీచర్స్ కాలనీ, అచ్చమ్మ బజారు, పటమట ప్రాంతం, యాదవుల బజారు, జ్యోతి విద్యాలయం స్కూల్ రోడ్డు, వరలక్ష్మీ నగర్, కంచుకోట బజారు, ఐదో నంబర్ రోడ్డు, బ్యాంకు కాలనీ1-2 రోడ్లు, ఆచార్య రంగా నగర్, క్రీస్తురాజపురం కొండప్రాంతం, విజయ్‌నగర్ కాలనీ, సొసైటీ క్వారీ, గుంటూరు బాపనయ్య నగర్ తదితరప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పనులు జరుగుతున్నందున సోమవారం సాయంత్రం నీటి సరఫరా నిలిపివేస్తామని వివరించారు. ఆయా ప్రాంతాల వాసులు ముందుగానే నీటిని నిల్వ చేసుకుని వీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే

సాక్షి ఎఫెక్ట్



ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): 57 నుంచి 64వ డివిజన్‌లలో పెరుగుతున్న జ్వరాలు.. జ్వరపీడితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ 'విజృంభిస్తున్న విష జ్వరాలు' శీర్షికకు 'సాక్షి'లో శనివారం వెలువడిన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. డీఎంఓహెచ్ సుహాసిని ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది న్యూ రాజరాజేశ్వరిపేట, సింగ్‌నగర్, నందమూరి నగర్, వాంబేకాలనీ, శాంతినగర్, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, పాయకాపురం, కండ్రిక పరిసర ప్రాంతాల్లో జ్వరాల సర్వే, పీడీపీ (పెరి డోమెస్టిక్ పాట్స్) సర్వే, ఫాగింగ్ కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, అసిస్టెంట్ మలేరియా అధికారి డి.సూర్యకుమార్, వైద్యాధికారి బి.రామచంద్రారెడ్డి నేతృత్వంలో సిబ్బంది రక్త నమూనాలు తీసి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నియంత్రణ కార్యక్రమాలు చేపట్టారు.